

ఎస్‌బిఐ సిఎస్‌పిలో అవినీతి కలకలం

గుట్టుచప్పుడు కాకుండా ఐడీ బ్లాక్

మరో ఐడిలో కొనసాగుతున్న సిఎస్‌పి



యథావిధిగా కొనసాగుతున్న ఎస్బీఐ సిఎస్పీ పాయింట్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్బీఐకి సంబంధించిన సిఎస్పీ (ఖాతాదారుల సహాయ కేంద్రం)లో నిర్వహకుడు చేతివాటం ప్రదర్శించి ఖాతా దారుల సొమ్ము కాజేశారు. దీంతో అమాయకులైన వృద్ధులు, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళల సొమ్మును లక్షల రూపాయలు కాజేసినట్లు తెలుస్తోంది. కొంతమంది బాధితుల ఫిర్యాదుతో సిఎస్పీ ఐడీలను సీజ్ చేసినట్లు ఎస్‌బిఐ మేనేజర్ శివయ్య తెలిపారు. తన వద్ద డబ్బు తీయడానికి, లేదా ఖాతాలో సొమ్ము ఎంత ఉంది అన్నది కనుక్కోవడానికి వెళ్లిన ఖాతా దారుల వద్ద బయోమెట్రిక్ వేయించు కొని ఖాతాలోని సొమ్ము ను కొద్ది కొద్ది గా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు ఖాతా దారుల ఫిర్యాదుతో చేపట్టిన విచారణలో వాస్తవం తేలడంతో సిఎస్పీ ఐడీ బ్లాక్ చేశామని వెల్లడించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇరువురి ఐడీలలో ఇలా అవినీతికి పాల్పడ్డారని అన్నారు. తమకు ఫిర్యాదు చేసిన ఖాతాదారులకి సొమ్మును రికవరి చేయించామని అన్నారు. అయితే ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విషయాన్ని అదికారులు గుట్టు చప్పుడు కాకుండా సిఎస్పీ ఐడీలు బ్లాక్ చేసి చేతులు దులుపుకున్నారు. అయితే రోజు వారి ఇలాంటి ఫిర్యాదులు ఇంకా అందుతున్నాయని మేనేజర్ అన్నారు. ఎవరైన ఇలా మోసపోయి ఉంటే బ్యాంక్ లో రాత పూర్వకంగా పిర్యాదు చేయాలని కోరారు. కాగా ఇలా కాజేసిన సొమ్ము లక్షల రూపాయల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అవినీతి తెలిసి పిర్యాదు చేసిన వారి సంగతి సరే అసలు తెలియని చాలామంది రైతులు తమకు ప్రభుత్వ పథకాల ద్వార రైతు భరోసా పేరిట పడ్డ సొమ్ము తమ క్రాప్ లోన్ లకు జమా అయిందని మోసపోయారని తెలుస్తోంది. అలాగే మహిళలు తమ స్వయం సహాయక సంఘాల పొదుపు అప్పులకు జమ అయిందని మోసపోయినట్లు తెలుస్తోంది. ఇలాంటి వారు బ్యాంక్ లో స్టేట్ మెంట్ తీసుకోవడం ద్వారా సరిచూసుకొవచ్చు అని మేనేజర్ అన్నారు. అయితే సిఎస్పీ ఐడి సీజ్ చేశామని బ్యాంక్ మేనేజర్ చెబుతున్నప్పటికి యథా స్థానంలో సిఎస్పీ పాయింట్ కొనసాగుతుండటం ఆశ్చర్యం కల్గిస్తుంది. దీనిపై ఎస్బీఐ మేనేజర్ ని వివరణ కోరగా వారు హిందూపురానికి చెందిన బ్యాంక్ ఐడి తో కొనసాగిస్తున్నారని అన్నారు. అది తమ బ్రాంచ్‌కి సంబంధం లేని కారణంగా సీజ్ చేయలేక పోయామన్నారు. అయితే ఖాతా దారులు జాగ్రత్త వహించాలన్నారు. సర్వీసుఛార్జీల పేరుతో ఏ ఒక్క రూపాయి అడిగిన తమకు ఫిర్యాదు చేయాలన్నారు. అయితే ఖాతా దారులపై ఇలాంటి వాటిపై అవగాహన కల్పించల్సిన అవసరం ఉంది.

ఓటు బడ్జెట్..!





- ఉమ్మడి జిల్లాకు మరోసారి నిరాశే
- కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు నిల్
- కార్పొరేట్లకే అనుకూలం అంటూ విమర్శలు

ఉమ్మడి జిల్లాకు నిధులు కేటాయించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరోసారి మోసం చేసింది. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో సైతం ఎలాంటి కేటాయింపులూ చేయలేదు. గతంలో పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ల్లోనే ఎలాంటి కేటాయింపులూ చేయని కేంద్రం ఓటుఆన్ బడ్జెట్‌లో కూడా అదే తీరును కొనసాగిస్తూ మరోసారి మొండిచేయి చూపింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ కరువు జిల్లాకు కేంద్రం ఏదోసాయం చేస్తుందని ఆశ పెట్టుకోవడం, తీరా చూస్తే ఎలాంటి కేటాయింపులూ లేకుండా ఉసూరుమనిపించడం పరిపాటిగా మారుతోంది. గురువారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓటు బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు నిధుల కేటాయింపులు ఆశించినంత జరగకపోవడంపై జిల్లావాసులు తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన ఓటుఆన్ అకౌంట్ బడ్జెట్ 'ఓటు' బడ్జెట్‌లాగానే ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధంగా ఈ బడ్జెట్ ఉన్నట్టు వామపక్షాలు విమర్శిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వరకు చూసుకున్నా పెద్దగా నిధుల కేటాయింపులేవీ కనిపించలేదు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ల్లేవు.. చివరాఖరుకు కేంద్రీయ విశ్వవిద్యాలయంకు గతేడాది నిధులతోనే సరిపెట్టేలాగా కనిపిస్తోంది. 2024-25కు ఒక్క రూపాయికీ కేటాయించలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైల్వేకి ఏ మేరకు నిధులు కేటాయించారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పింక్‌బుక్ గుంతకల్లు డివిజన్‌కు వస్తేగాని నిధుల కేటాయింపులో ఏ మేరకు ప్రాధాన్యత లభించిందన్నది తెలియదు. గతంలో పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే ఎలాంటి కేటాయింపులూ చేయని కేంద్రం ఓటు ఆన్ బడ్జెట్‌లో కూడా మరోసారి మొండి చేయి చూపి జిల్లా ప్రజలను మోసం చేసింది.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు నిల్

అనంతపురం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయించే వాటిల్లో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉంది. విభజన హామీల్లో భాగంగానే దీన్ని జిల్లాకు కేటాయించారు. ఇది ప్రారంభమై ఐదు సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటికీ సొంత భవనం లేదు. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేస్తామన్న ప్రకటనలు ప్రభుత్వం వైపు నుంచి వస్తున్నా ఆచరణలో అమలు జరగలేదు. ఇప్పుడు జంతలూరు వద్ద నిర్మాణాలు ప్రారంభమైనప్పటికీ ఒకటి, రెండు భవనాల నిర్మాణాలు మాత్రమే జరుగుతున్నాయి. వీటికి నిధులు కూడా నామమాత్రంగానే కేటాయించారు. 2022-23 సంవత్సరంలో రూ.12.82 కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్‌లో రూ.47.40 కోట్లు కేటాయించారు. అయితే దాన్ని రూ.112.08 కోట్లకు సవరించారు. 2024-25కు మాత్రం ఒక్కరూపాయి నిధులు కూడా బడ్జెట్‌లో కేటాయించలేదు.

వెనుకబడిన ప్రాంతాలకు నిధుల్లేనట్టే ?

విభజన హామీల్లో వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామన్న హామీని కేంద్రం మరోసారి అటకెక్కించింది. ఇందులో పాత అనంతపురం జిల్లా కూడా ఉంది. 2014 తరువాత మూడు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున కేటాయించి ఎత్తేశారు. ఓటు ఆన్ బడ్జెట్‌లోనూ దీని ప్రస్తావ లేకపోవడం అందరినీ అసంతృప్తికి గురిచేస్తోంది.

బడ్జెట్లో మొండి చేయి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి, జిల్లాకు మరోసారి తీరని అన్యాయం జరిగింది. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుపై కనీస ప్రస్తావన లేదు. విశాఖలో ఓడరేవు అభివద్ధి, పోలవరం ప్రాజెక్టుకు ఇస్తామన్న రూ.32 వేల కోట్లు ఆ ప్రస్తావన చేయకపోవడం రాష్ట్రానికి ద్రోహం చేయడమే అవుతుంది. విద్యకు అవసరమైన నిధులు కేటాయించలేదు. పుట్టపర్తిలో సత్యసాయి విమానాశ్రయాన్ని విస్తరించి, విడిభాగాల పరిశ్రమ ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి బడ్జెట్లో ఊసే లేదు. రాష్ట్రం, జిల్లాకు ఇంత అన్యాయం జరిగినా కూడా వైసిపి ప్రభుత్వం దీనిపై స్పందించకపోవడం విచాకరం. ఏపీకి రావాల్సిన నిధులపై ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి.

ఎం.ఇంతియాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అధిష్టానం ఆదేశం మేరకు పనిచేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

అధిష్టానం ఆదేశం మేరకు పనిచేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వైసిపి శ్రేణులకు పిలుపు నిచ్చారు. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్యే నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయన మండలాల వారీగా పార్టీ బలోపేతం, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం నా బలం కార్యకర్తలేనని, భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో అండగా నిలవాలని కోరారు. మీ అందరి సహకారంతో సిఎం జగన్ నాయకత్వంలో మడకశిర ప్రాంతాన్ని అభివృద్ధి చేశానన్నారు. మడకశిర మండలంలోని చెరువులను కృష్ణా జలాలతో నింపామన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపడానికి మీ అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రొళ్ల జడ్పిటిసి అనంతరాజు, గుడిబండ ఎంపిపి రాధమ్మ, సర్పంచులు గీతఅంజనమూర్తి, ఎంపిపి కవితా సత్యనారాయణ, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

గృహ నిర్మాణ పనులు వేగవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గానికి 26వేల పక్కాగృహాలు మంజూరయ్యాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన తనక్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న ఇల్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికి సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు, సిమెంట్ పంపిణీ బిల్లులు చెల్లించడంలో అలసత్వం ప్రదర్శించకూడదని ఆదేశించారు. సమయం లేదని రెండు నెలల లోపల గృహ నిర్మాణ పనుల ప్రగతి చూపించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలు పునాదులకే పరిమితం అయిన నిర్మాణాలు విషయమై అధికారులతో సమీక్షించారు. త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ పీడీ చంద్రమౌళిరెడ్డి, నియోజకవర్గస్థాయి డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయంలో శాసనాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరిలోనిశ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని దీప స్తంభాలపై శాసనాలు ఉన్నట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. మహా మండపం ముందు ధ్వజస్తంభం పక్కన గల దీప స్తంభంపై తెలుగు శాసనం ఉందన్నారు. ఆ దీప స్తంభాన్ని మొదటి బుక్కరాయల కుమారుడు రెండో హరిహరరాయలు సామాన్య శకం1388 లో ఏర్పాటు చేసినట్టు శాసనంలో పేర్కొన్నారన్నారు. శాలివాహన శకం 1310 విభవ నామ సంవత్సరం శ్రావణ శుద్ధ దశమి నాడు గుడిలో దీప స్తంభాన్ని నిలబెట్టారని శాసనంలో రాసినట్టు మైనాస్వామి వివరించారు. గుడి రాజగోపురం ముందున్న పెద్ద దీప స్తంభాన్ని సామాన్య శకం 1469 లో ఏర్పాటు చేసినట్లు స్తంభం పైనున్న కన్నడ శాసనం చెబుతున్నట్టు చరిత్రకారుడు పేర్కొన్నారు. శాలివాహన శకం 1391 విరోధి సంవత్సరం ఆషాడ శుద్ధ దశమి నాడు ఆ నాటి విజయనగర ప్రభువు రెండో విరూపాక్ష రాయల ఆదేశం మేరకు స్థానిక ప్రతినిధులు దీప స్తంభాన్ని నిలబెట్టారన్నారు. దక్షిణ భారత శాసనాల సంపుటి 9 రెండో భాగం, 16 లో కదిరి దీపస్తంభాల శాసనాల వివరాలు నమోదు కాలేదని ఆయన చెప్పారు.

మృతుల కుటుంబాలకు సవితమ్మ పరామర్శ

రొద్దం : 5 నెలల క్రితం కర్నాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పరమేష్ కుమారుడు రాము తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకొంటున్నాడు. అతడు గురువారం మృతిచెందగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. అనంతరం గోనిమేకపల్లి గ్రామానికి చెందిన బాబు తండ్రి మృతి చెందగా అక్కడికి వెళ్లి నివాళు లర్పించారు. బాబు తండ్రి మృతదేహానికి శశిభూషణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట నాయకులు నరసింహులు, హరీష్, మాధవనాయుడు, వెంకట రామిరెడ్డి, ఆంజనేయులు, నరసింహులు, వీరాంజనేయులు, హనుమంతరాయుడు, మంజునాథ్, చెన్నకేశవులు, సిద్దన్న, లింగప్ప, తిమ్మయ్య, క్రిష్టప్ప, గంగాధర్ పాల్గొన్నారు.


మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సవితమ్మ

రొళ్లలో టిడిపి జెండాల తొలగింపు

అభ్యంతరం తెలపని టిడిపి మండల కన్వీనర్..!

ఆయన తీరుపై తెలుగుతమ్ముళ్ల ఆగ్రహం

ప్రజాశక్తి-రొళ్ల

మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన టిడిపి జెండాలు, బ్యానర్లను వైసిపి నాయకులు గురువారం నాడు తొలగించారు. వైసిపి నాయకులు వీటిని తొలగిస్తున్నా మండల టిడిపి ముఖ్యనాయకులు ఎవరూ దీనిని ప్రశ్నించకపోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత 15 రోజులుగా మండల కేంద్రంలో వివిధ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, జెండాలను వివిధ కూడళ్లలో ఏర్పాటు చేశారు. శుక్రవారం నాడు మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి జెండాలు, బ్యానర్లను తొలగించాలంటూ వైసిపి నాయకులు సూచనలు చేయడంతోనే వాటిని తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధి తనయుడు దగ్గరుండి టిడిపి జెండాలను తొలగించారు. మండల కేంద్రంలో టిడిపి జెండాలతో పాటు వైసిపి, ఇతర సంఘాలకు సంబంధించిన జెండాలు చాలా ఉన్నాయి. అయితే వీటిని తొలగించకుండా ఒక్క టిడిపి జెండాలను మాత్రమే ఎందుకు తొలగిస్తున్నారని టిడిపి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. జెండాల తొలగింపు విషయం మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అసహనానికి లోనయ్యారు. జెండాలు తొలగిస్తున్నా కనీసం స్పందించని మండల టిడిపి కన్వీనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీని ముందుండి నడిపించడంలో విఫలమైన మండల కన్వీనర్ వెంటనే ఆ పదవికి రాజీనామా చేసి దిగిపోవాలని కొందరు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. కుమ్మక్కు రాజకీయాలతో ఇప్పటికే పార్టీ చాలా నష్టపోయిందని జెండాలను తొలగిస్తున్నా కనీసం స్పందించని నాయకులు ఉండడం పార్టీకి మరింత నష్టాన్ని చేకూరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రొళ్లలో టిడిపి జెండాల తొలగింపుపై ఆ పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులు దృష్టి సారించి మండల తెలుగుదేశం కన్వీనర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక టిడిపి మద్దతుదారులు కోరుతున్నారు. కాగా టిడిపి జెండాల తొలగింపుపై మండల కన్వీనర్ దాసిరెడ్డిని వివరణ కోరగా వైసిపి నాయకులు జెండాలు తొలగించాలని కోరారని, ఎవరి పార్టీ కార్యక్రమాలు ఉన్నప్పుడు వారి జెండాలను మాత్రమే ఏర్పాటు చేద్దామని చెప్పడంతో తాను తొలగింపునకు సరే అన్నానని చెప్పుకొచ్చే ప్రయత్నం చేశారు.

ధర్మవరం..ఉద్రిక్తం..!


డీఎస్పీ శ్రీనివాసులుతో వాదిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

- కాక రేపిన రోడ్ల మరమ్మతు వ్యవహారం
- మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అరెస్టు
- మార్కెట్‌యార్డు వద్ద పోలీసులతో వాగ్వాదం
- గోనుగుంట్లతో సహా 29 మందిపై కేసులు నమోదు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలో ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న గుంతలను పూడ్చే విషయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఇటీవల ప్రభుత్వం, అదికారులను మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ కోరారు. అధికారుల నుంచి స్పందన రాకుంటే తాను సొంత ఖర్చులతో గుంతలను పూడుస్తానని తెలియజేశారు. గుంతలు పూడ్చే విషయంపై అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో సూర్యనారాయణ గురువారం ఉదయం ధర్మవరం పట్టణంలో రోడ్ల మరమ్మతులు చేసేందుకు సిద్ధ పడ్డారు. ఇందుకు అవసరమైన వాహనాలు, వస్తువులతో ధర్మవరానికి చేరుకున్నారు. సూర్యనారాయణ ధర్మవరం పట్టణానికి వస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు పట్టణ సమీపంలోని మార్కెట్‌యార్డు వద్ద ఆయన్ను అడ్డుకున్నారు. శాంతిభద్రతల సమస్య దృష్ట్యా గుంతలు పూడ్చే కార్యక్రమానికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. ఇందుకు సూర్యనారాయణ ఒప్పుకోలేదు. ఈ పరిస్థితుల్లో పోలీసులు సూర్యనారాయణ అనుచరుల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఒత్తిడికి పోలీసులు తలొగ్గి అభివద్ధి పనులను ఎలా అడ్డుకుంటారంటూ గోనుగుంట్ల అనుచరులు ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా తాను ధర్మవరం వెళ్లితీరుతానని సూర్యనారాయణ స్పష్టం చేయడంతో పోలీసులు ఆయన్ను బలవంతంగా అరెస్టు చేశారు. అరెస్టు చేసే క్రమంలో పోలీసు జీపునకు గోనుగుంట్ల అనుచరులు అడ్డంగా కూర్చొన్నారు. పోలీసులు వారందరినీ పక్కకు నెట్టేసి సూర్యనారాయణను అరెస్టు చేసి ధర్మవరం రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం నాలుగు గంటల వరకు స్టేషన్‌లో ఉంచుకుని అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

అభివృద్ధి చేస్తామంటే అడ్డుకుంటారా..? : గోనుగుంట్ల

ధర్మవరంలో తన సొంత ఖర్చులతో రోడ్ల మరమ్మతు పనులను చేయిస్తానంటే అడ్డుకోవడం ఏమిటంటూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు అరెస్టు చేసే క్రమంలో భాగంగా ఆయన వారిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లలో గుంతలను పూడ్చలేని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తాను అల్టిమేటం ఇచ్చిన తరువాత పనులు మొదలు పెట్టేందుకు శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. తాను ప్రజాపక్షంగా ఉంటే ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రజాభక్షణగా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు.

గోనుగుంట్లతో సహా 29పై కేసు నమోదు

ధర్మవరంలో గురువారం నాడు జరిగిన ఘటనకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణతోపాటు మరో 29 మందిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించారన్న నెపంతో గోనుగుంట్లతో పాటు మరో 29 మందిపై 143,145,188,341, 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను అడ్డుకుంటాం : టిడిపి

ప్రజాశక్తి-అమరాపురం

వైసిపి పాలనలో నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలో పర్యటిసున్నారని, అందుకే మంత్రి పర్యటనను అడ్డుకుంటామని మండల టిడిపి నాయ కులు పేర్కొన్నారు. అమరాపురంలో గురువారం పార్టీ మండల కన్వీనర్ గణేష్ విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఎమ్మెల్యే తిప్పేస్వామి ఐదేళ్ల నుంచి ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. తమ్మడేపల్లి రోడ్డు అర్థాంతరంగా ఆగిపోయిందని, ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు లు సొంత డబ్బుతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ఐదేళ్లలో ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సక్రమంగా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. మల్బరీ రైతులను విస్మరించారన్నారు. ఆయా సమస్యలపై మంత్రి పర్యటనను టిడిపి ఆధ్వర్యంలో అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.నరసింహమూర్తి, నాయకులు కృష్ణమూర్తి, శివరుద్రప్ప, శివకుమార్‌యాదవ్, రామచంద్రప్ప, మంజునాథ్, దాదు, హనుమంతరాయ పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు పోలీసుల నోటీసులు

అమరాపురంలోని టిడిపి మండల నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను అడ్డుకుంటామని టిడిపి శ్రేణులు పేర్కొన్న నేపథ్యంలో విషయం తెలుసు కున్న పోలీసు సిబ్బంది నాయకులకు నోటీసులు జారీ చేశారు. మంత్రి పర్యటనలో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ఎస్ఐ వెంకటేశ్వర్లు నోటీసులు జారీ చేశారు. నాయకులు మంత్రి పర్యట నను అడ్డుకోవడానికి అనుమతి లేదని, అడ్డుకుంటే వారిపై చట్టపమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఉరుసు ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ పరిధిలోని జంబుల బండ భూతప్ప కనుమలో వెలసిన సయ్యద్ మస్తాన్ షా వలి ఉరుసు ఆహ్వాన పత్రికను గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణ లో ఏర్పాటు చేసిన సభలో హిందూ ముస్లింలు సయుక్తంగా ఆవిష్కరించారు. ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎంఆర్ హనుమంతు అధ్యక్షతన ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉరుసు నిర్వాహకులు మునావీర్, ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ నాయకులు ఉబెదుల్లా హుసేన్, సినిమా డైరెక్టర్ ధనరాజ్, దళిత సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు ఎపి ముత్యాలు, రామప్ప, అమీర్, సాదత్, జబివుల్లా, జిలాన్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మునిస్వామి, ఎంపిపి ఈరన్న తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, జడ్పిటిసి సభ్యులు, వైస్ ఎంపిపిలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరుకావాలని వారు కోరారు.

బిసిల ద్రోహి జగన్ : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

బిసిల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ మోహన్ రెడ్డి బిసిలను అభివృద్ధి చేయకుండా వారికి వెన్నుపోటు పొడిచారని టిడిపి నాయకులు, బిసి నేత అంబికా లక్ష్మీనారాయణ విమర్శించారు. గురువారం పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి నాయకులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో బిసి సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంబికాతో పాటు బిసి నాయకులు మాట్లాడుతు పేరుకు బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కేవలం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమే అని ఎద్దేవా చేశారు. బీసీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, అంజినప్ప, పరమళ, రామాంజినమ్మ, రమేష్‌కుమార్‌తో పాటు పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గుడిబండ

గుడిబండ సమీపంలోని పలారం క్రాస్ వద్ద గురువారం సాయంత్రం ఎస్ఐ మునిప్రతాప్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి, తదితర డాక్యుమెంట్లను పరిశీలించి, అవి లేని వారి నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. తనిఖీల్లో ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

గాండ్లపెంట : మండల పరిధిలోని సోమయాజులపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ పీడీ లక్ష్మీ కుమారి గురువారం తనిఖీ చేశారు. పౌష్టికాహారం సకాలంలో అందచేయాలని అంగన్వాడీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కదిరి సిడిపిఒ గంగాలక్ష్మమ్మ, సూపర్‌వైజర్ పద్మావతి, కార్యకర్తలు ఈశ్వరమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

బత్తలపల్లి : మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలో శివమాలధారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్, ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాశ్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని 41 రోజులు పాటు నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రామాంజినేయులు, గోపాల్, శంకరయ్య, యోగానందా ఆచారి, బోరు శివయ్య, కమతం లక్ష్మినారాయణ, బిల్లే సూరి, కప్పల రవి, సురేష్, చిత్రా భాస్కర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

కొత్తచెరువు : అనంతపురం కలెక్టరేట్‌కు బదిలీ అయిన తహశీల్దార్ రామాంజనేయరెడ్డిని కార్యాలయ సిబ్బంది, చౌక ధాన్యపు డీలర్లు గురువారం ఘనంగా సన్మానించారు. అలాగే రిటైర్డ్ తహశీల్దార్ రామచంద్రప్పను సన్మానించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహశీల్దార్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, ఆర్ఐ దుర్గేష్, సర్వేయర్ సురేష్, విఆర్వోలు శ్రీనివాసులు, చెన్నయ్య, నారాయణప్ప, కాటమయ్య, వేణు, వైసీపీ నాయకులు మటన్ శంకర్ , సాంబశివరెడ్డి, మున్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

బుక్కపట్నం : జాతీయ రహదారి 342 రోడ్డు విస్తరణలో భాగంగా ఇల్లు కోల్పోయిన వారికి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఇళ్ల పట్టాలను గురువారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని చంద్రాయునిపల్లి గ్రామానికి చెందిన పలు కుటుంబాలు రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయాయి. వారందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకట రమణయ్య, మాధవరెడ్డి, బాధితులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు అందజేత

చిలమత్తూరు : చిలమత్తూరు మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పేదల కొట్టాలలో స్వామి జపానంద ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు చలిలో గుడిసెల్లో జీవనం ఉంటున్నారని అందుకనే తమ వంతు సాయంగా రామక్రిష్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమం లో సిపిఎం ప్రవీణ్ కుమార్, రామచంద్ర, సదాశివరెడ్డి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

కదిరి టౌన్ : వైసీపీ రాష్ట్ర బిసి. విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్‌ను వైసీపీ హిందూపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి శాంతమ్మ, కదిరి నియోజకవర్గ సమన్వయ కర్త మాక్బుల్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కదిరి రూరల్ మండలం కుమ్మరివాండ్లపల్లి లోని బత్తల నివాసానికి వెళ్లిన వారికి బత్తల కుటుంబీకులు సాదర స్వాగతం పలికారు. ఈసందర్భంగా శాంతమ్మ, మక్బూల్ తదితరులు బత్తల హరిప్రసాద్ తో సమావేశమై అభ్యర్థుల గెలుపునకు సహకారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, లీగల్ సెల్ జోన్ ఇన్‌ఛార్జి లింగాల లోకేశ్వర్ రెడ్డి, ఎంపీపీ వైస్ ఆదినారాయణ , మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్, ఏసురత్నం, నాగమల్లు, కాంట్రాక్టర్ బాబా, జంపాల నాగేంద్ర, అన్సర్ వలి, సంపంగి గోవర్ధన్, కౌన్సిలర్లు , ఇలాహి, షాను, నాసిర్,మార్కెట్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

పుట్టపర్తి రూరల్ : మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశాఖ జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొనంకి అశోక్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. చంద్ర, పివి. మాధవ, రవీందర్ రెడ్డి, అంజన మూర్తి, వెంకటనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు, నాయకులు

ఆశావర్కర్ల న్యాయమైన కోర్కెలు సాధన కోసం ఈనెల 8న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశ వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీసవేతనం, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు సాధన కోసం ఫిబ్రవరి 8న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్, మెటర్నిటీ లీవులు అమలు చేయాలన్నారు. రూ. 10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, పనిభారాన్ని తగ్గించాలని, పిహెచ్‌సికి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఎ, డిఎలు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు గోరంట్ల మంజుల, బుక్కపట్నం మంజుల, చెన్నకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

10న న్యాయవాదుల వర్క్‌షాప్

హాజరుకానున్న సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో ఈనెల 10వ తేదీన న్యాయవాదుల వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆలూరి రామిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా పెద్ద ఎత్తున న్యాయవాదుల వర్క్ షాప్‌ను అనంతలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ వర్క్ షాప్ అటు సీనియర్ ఇటు జూనియర్ న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ వర్క్ షాప్‌కు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అమానుల్లా, ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎవిఎన్ భట్ లతో పాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు వెంకట శేష సాయి, దుర్గాప్రసాద్, సురేష్ బాబు, మన్మథరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వస్సార్ప ఆధ్వర్యంలో రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నరసింహులు, సుదర్శన్, సిద్ధు, పీవీ శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో విడుదల చేయకపోతే సమ్మెకు సిద్ధం : సిఐటియు



వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

నిరవధిక సమ్మెలో భాగంగా ప్రభుత్వం మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం, సిఐటియుతో జరిపిన చర్చలు మేరకు ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని, లేని పక్షంలో సమ్మెకు సిద్ధమవుతామని సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు పట్టణంలోని ఇందిరా పార్కు నుంచి మున్సిపల్ కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నిరవధిక సమ్మెలో భాగంగా 16 రోజులపాటు పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకై ఆందోళన నిర్వహించారన్నారు. మున్సిపల్ కార్మిక నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి 16 రోజులు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు జీవో జారీ చేయకపోవటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే చర్చల్లో అంగీకరించిన వాటిపై జీవో విడుదల చేయాలని లేని పక్షంలో తిరిగి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌ఛార్జి కమిషనర్ సునీల్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, గురునాథ్, శంకర నారాయణ, నాగేంద్ర, బాబయ్య, చంద్రశేఖర్, శ్రీరాములు, సుబ్బులమ్మ, శోబమ్మ, ఓబులమ్మ, కవితమ్మతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

గడువులోగా పథకాల అమలు : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం వివిధ అంశాలపై విజయవాడ నుంచి ప్రధాన సెక్రటరీ డాక్టర్ కె ఎస్ జోహార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెవిన్యూ సర్వే మూడవ దశ ఇనాం, అసైన్డ్ భూములు, శ్రీ శిశు సంక్షేమం, చిన్నారుల అభివృద్ధి పథకం, వైద్య ఆరోగ్యం, కుటుంబం సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ, ఉపాధి హామీ పథకం క్రింద కరువు మండలాలలో చేపట్టిన పనులు తదితర అంశాలను సమీక్షించారు. జిల్లాలో తాగునీటి సమస్య వేసవిలో తలెత్తకుండా ముందు జాగ్రత్త పాటించాలన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు చేపట్టిన ఏర్పాట్లు తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ఒ ఎస్‌వి కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, ఐసిడిఎస్ పీడీ లక్ష్మికుమారి, సర్వే భూమి రికార్డ్స్ అధికారి రామకృష్ణ, తహశీల్దార్ అనుపమ, సిపిఒ విజయ్ కుమార్, డీఈవో మీనాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్ ఖాన్, డిసిఒ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ధర్మవరం టౌన్ : డ్రైవర్లను జైలుపాలు చేసే హిట్‌అండ్ రన్ చట్టాల రద్దు కోసం ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టే రవాణా రంగం సమ్మెను విజయవంతం చేయాలని ట్రాన్స్‌పోర్ట్ రంగం రాష్ట్ర నాయకులు రఫీ, సిఐటియు మండల కార్యదర్శి అయూబ్‌ఖాన్ కోరారు. సమ్మెకు సంబంధించి కరపత్రాలను స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. దేశంలోనే అసంఘటిత రంగాల్లో అతిపెద్దరంగం రవాణారంగం అన్నారు. ఈరంగం ద్వారా ఎంతోమంది ఆధారపడిజీవిస్తున్నారన్నారు. కేంద్రం గత ఏడాది డిసెంబరులో భారత న్యాయ సంహిత పేరుతో కొత్త చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకుని రాష్ట్రపతి ఆమోదం పొంది సెక్షన్ 106-1 ప్రకారం ప్రమాదం చేసిన డ్రైవర్ అక్కడి నుండి వెళ్లే హిట్ అండ్ రన్ పేరుతో పది సంవత్సరాలు జైలు శిక్ష రూ.10 లక్షలు జరిమాన విధించే విధంగా దుర్మార్గమైన చట్టాన్ని రూపొందించారన్నారు. ఈ చట్టం అమల్లోకి రావడం వల్ల డ్రైవర్లు ఆందోళనకు గురై సమ్మెచేపట్టనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కేతిరెడ్డి అక్రమాలు బట్టబయలు : పరిటాల శ్రీరామ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఐదేళ్లపాటు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చేసిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. రేగాటిపల్లి సొసైటీ భూములు పరిటాల రవీంద్ర హయాంలో 900మందికి పేదలకు పంచడం జరిగిందన్నారు. అప్పట్లో ప్యాక్షన్ ప్రభావిత ప్రాంతంగా ఉండే రేగాటిపల్లిలో అంతా వ్యవసాయం చేసుకుంటూ శాంతియుతంగా జీవించాలని భూపంపిణీ చేశారన్నారు. అయితే 2004 కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ భూమిలో 300 ఎకరాలు హౌసింగ్ ప్లాట్లకు కేటాయించారని, ఆ తరువాత కేతిరెడ్డి 2012లో ఎమ్మెల్యేగా ఉండగా తిరిగి భూ పంపిణీచేశారని అన్నారు. ఈ విషయంపై టిడిపి స్థానిక నేతలు పోరాడారన్నారు. కేతిరెడ్డి చేసిన అక్రమాలు రోజురోజుకు బయటకు వస్తున్నాయన్నారు. గతంలో సోలార్ భూములు కూడా ఇలానే లాక్కున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో ఇచ్చిన పట్టాలను మళ్లీ తీసుకుని ఆయన అనుచరులకు దక్కేలా చేస్తున్నారని విమర్శించారు. కేతిరెడ్డి చెప్పినవన్నీ చేస్తూ తహశీల్దార్లు, వీఆర్ లు ఇతర సిబ్బంది సస్పెండ్ అవుతున్నారన్నారు. ఇప్పుడు ఇలా ప్రజలకు దక్కాల్సిన భూములు కాజేసిన వారు తాత్కాలికంగా సంతోషంగా ఉండొచ్చుకానీ టీడీపీ అధికారంలోకి వచ్చాక వాటిని ప్రజలకు చెందేలా చేస్తామని, అక్రమాలు చేసినవారు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు.

నాలుగువరుసల రహదారి పనులు ప్రారంభం


ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలో నాలుగు వరుసల రహదారికి సంబంధించిన పనులు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక కళాజ్యోతి సర్కిల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి రహదారి పనులకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో ప్రధాన రహదారి దెబ్బతినడంతో ప్రజలు అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించి కొత్త రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిఎంను కోరామన్నారు. స్పందించిన సీఎం జగన్ గత యేడాది డిసెంబర్ 5న రూ.4కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేశారన్నారు. జనవరి 18న టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టణ పరిధిలో 6.62కిలోమీటర్ల పొడవున రోడ్డును నిర్మించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివద్ధి కార్యక్రమాలకు అడ్డువస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేములజయరామిరెడ్డి, కమిషనర్ రామకుమార్, ఆర్అండ్‌బి ఈఈ సంజీవయ్యలతో పాటు 40వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జులు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

టిడిపిలో పలువురు చేరిక



పార్టీలోకి చేరిన వారితో కందికుంట

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండల పరిధిలోని పట్నం, కొండమనాయునిపాళ్యం గ్రామాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ సమక్షంలో వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలోకి చేరిన వారందరికి కందికుంట టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా వైసిపికి చెందిన నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి భారీ ఎత్తున చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, నాగూరి శ్రీనివాస రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని పరాకువాండ్లపల్లిలో కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో పలువురు బిజెపి నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. బిజెపి మండల కన్వీనర్ గుడుపల్లి రెడ్డప్ప రెడ్డి, నాగిరెడ్డి, రామాంజులు రెడ్డి, వంశితో పాటు 20 కుటుంబాలు పరాకువాండ్లపల్లిలో ఏర్పాటు చేసిన సభలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్ కుమార్ రెడ్డి, బంగారు కృష్ణమూర్తి, న్యాయవాది నాగేంద్రప్రసాద్, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, జనసేన ఎంపీటీసీ అమర్ కార్తికేయ, విదుర శేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ బాబు, మాజీ మండల కన్వీనర్లు శంకర్ నాయుడు, రాజారెడ్డి, కుంచె నాగేంద్ర ప్రసాద్, మల్లికార్జున, తోట సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు డిఎస్‌సి పూర్తి స్థాయి విడుదల చేయాలేదని, పోస్టుల సంఖ్యను పెంచి, మెగా డీఎస్సీని విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతు డీఎస్సీ ప్రతిపాదనని మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే గత నాలుగు సంవత్సరాల నుంచి ఊరిస్తూ కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ నాటికి జూన్ వరకు రిటైర్ట్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి పోస్టులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

లేపాక్షి : మండలంలోని చోళసముద్రం గ్రామంలో గురువారం విజయ్(19) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎఎస్ఐ షర్ఫుద్దీన్ తెలిపిన వివరాలు.. చిలమత్తూరు మండలంలోని వడ్డి చెన్నమపల్లి గ్రామానికి చెందిన వెంకటాద్రి కుమారుడు విజయ్ చోళసముద్రంలో వెంకటేశప్ప నూతన ఇంటి నిర్మాణం పనులకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ వైరు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు చేతికి తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిం చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలపడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీర య్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి

ఓబుళదేవర చెరువు : మండలంలోని తుమ్మలకుంట్లపల్లికి చెందిన వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నంజప్ప నాయుడు (65) దిన కూలి. ఈ నేపథ్యంలో తువాంక పల్లికి చెందిన వెంకట రామి రెడ్డి నంజప్ప నాయుడు కి ఫోన్ చేసి తన పొలం లో కరెంట్ లైన్ తెగిపోయిందని వైరు లాగడానికి చేను వద్దకు రమ్మని పిలిచాడు. ఇద్దరు కలిసి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు నంజప్ప నాయుడుకు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన హర్షవర్ధన్(27) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఆటోను వెంగళమ్మ చెరువు గ్రామంలో ఒక హోటల్ వద్ద నిలిపి ఇంటికి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి , పుట్టపర్తి జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే హర్షవర్ధన్ మృతిచెందినట్లు ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో మోటార్, కేబుల్ చోరీ

సోమందేపల్లి : మండలంలోని గుడిపల్లి గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం తెల్లవారుజామున మోటార్, 30 మీటర్ల కేబుల్ చోరీకి గురైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ విజయ్‌కుమార్ పాఠశాలకు చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ పాఠశా లలో ఇప్పటికే పలుమార్లు మోటార్, కేబుల్ చోరీకి గురయ్యాయని, ప్రస్తుతం రూ. 30 వేల విలువ చేసే మోటార్ కేబుల్ ఎత్తుకెళ్లారని హెచ్ఎం హనుమంతరాయుడు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

లేపాక్షి : మండలంలోని సిరివారం గ్రామంలో తిరుమల దేవరపల్లి గ్రామానికి చెందిన కురుబ రాజకుమార్(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. సిరివారం పంచాయతీ పరిధిలోని తిరుమల దేవరపల్లి గ్రామానికి చెందిన ఆదిమూర్తి, నారాయణమ్మ దంపతుల కుమారుడు రాజకుమార్ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. బుధవారం నలుగురు స్నేహితులతో కలిసి సిరివారం గ్రామానికి చెందిన ఓ రైతు మల్బరీ షెడ్డులో రేషం పురుగులను చంద్రికల్లో వేయడానికి వెళ్లారు. అయితే అతడు అదే షెడ్డులో మంచం మీద మృతి చెంది ఉండడంతో గమనించిన స్థానికులు తల్లికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధం

బత్తలపల్లి : తాడిమర్రి మండలం పూలఓబుయలపల్లికి చెందిన రైతు ఎలంకూరి నారాయణరెడ్డి మామిడి తోట కంచెకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు దగ్ధం అయ్యాయి. గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి తనకున్న 9 ఎకరాల పొలంలో గత పది సంవత్సరాల క్రితం మామిడి తోట సాగు చేశాడు. అందులోనే చుట్టూ టేకు, అల్లనేరేడు చెట్లు పెంచుతూ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ నేపథ్యంతో బుధశారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మామిడితోట కంచెకు నిప్పుపెట్టారు. దీంతో కంచె కోసం ఏర్పాటుచేసిన రాతి దూలాలు విరిగిపోయాయి. దాంతోపాటు కంచెకు సమీపంలో ఉన్న 10 మామిడిచెట్లు, 20 టేకు, అల్లనేరేడు చెట్లు, డ్రిప్పు వైరు కాలిపోయాయి. తనంటే గిట్టనివాళ్లు దురుద్దేశపూర్వకంగానే ఈ చర్యకు ఒడిగట్టారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనతో తనకు రూ. 3లక్షలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు చెప్పాడు.

మృతదేహం లభ్యం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం చెర్లోపల్లి రిజర్వాయరులో మృతదేహం లభ్యమైంది. మృతుడు నల్లమాడ మండలం బసంవారిపల్లికి చెందిన మహేందర్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు. మహేందర్‌రెడ్డి ఆమడగూరు మండలం గుండువారిపల్లి లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సిఐలు

ముదిగుబ్బ : మండలంలోని రూరల్, టౌన్ సిఐలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రూరల్ సిఐగా కృష్ణంరాజు నాయక్, టౌన్ సిఐగా యతీంద్ర బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు : శ్రీ సత్యసాయి జిల్లా సమగ్ర శిక్షణ అభివృద్ధి కార్యాలయంలో. సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులను భర్తీ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదల చేశామని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మీనాక్షి, జిల్లా వృత్తి విద్య కోఆర్డినేటర్ లాజర్ తెలిపారు. ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, స్కూలింగ్ కోఆర్డినేటర్, ప్లానింగ్ అండ్ కోఆర్డినేటర్ ,కమ్యూనిటీ మొబైల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇందుకు డైట్ లెక్చరర్లు, హై స్కూలు ప్రధాన ఉపాధ్యాయులు, ఎంఈవోలు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న ఉన్న వారు తమ దరఖాస్తులను రెండవ తేదీన బుక్కపట్నం కార్యాలయంలో సాయంకాలం ఐదు గంటలలోపల అందజేయాలని వారు కోరారు.

టిడిపి మండల ప్రచార కమిటీ ఏర్పాటు

ధర్మవరం టౌన్ : ప్రతి కార్యకర్త ఒక సైనికునిగా పనిచేసి టిడిపికి విజయానికి కృషి చేయాలని జెడ్పీ మాజీ ఛైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి కోరారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల ప్రచార కమిటీని ఎన్నుకున్నారు. మాజీ జెడ్పీటీసీ మేకల రామాంజనేయులు, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, గోర్తి మహేష్ చౌదరి, సర్పంచు ముత్యాలప్ప చౌదరి, చిగిచెర్లరాఘవరెడ్డి, ముచ్చురామి క్రిష్ణ, రాంపురం శీన, బిల్లేశీన, అమర సుధాకర్ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కదిరి మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్ కుమార్

కదిరి అర్బన్ : కదిరి మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఎన్నికల సందర్భంగా సాధారణ బదిలీలపై ప్రస్తుతం కదిరి మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరిబాబు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సాధారణ బదిలీపై కిరణ్ కుమార్ బదిలీ చేసినట్లు జీవో విడుదల చేశారు.

ఎన్నికల ముందు జగన్నాటకం: టిడిపి

కదిరి టౌన్ : ఎన్నికల ముందు జగన్ మోహన్ రెడ్డి మరో నాటకానికి తెరలేపారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సోమశేఖర్ ఆరోపించారు. గురువారం కదిరి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేస్తూ అధికారంలో వస్తే ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తానని టీచర్ పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని విస్మరించిన ఆయన నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో ఒక డీఎస్సీ నిర్వహించే పాపాన పోలేదన్నారు.

'పురం' మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్ రెడ్డి

హిందూపురం : హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్ రెడ్డిని నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవోను జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న ప్రమోద్ కుమార్‌ను జమ్మలమడుగు పురపాలక సంఘానికి బదిలీ చేశారు. కె.శ్రీకాంత్ రెడ్డిని హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

16న భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

హిందూపురం : ఈ నెల 16న చేపట్టిన కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య పిలుపు నిచ్చారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఉన్నా కార్మిక భవన్‌లో సిపిఐ నియోజక వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వేమయ్య యాదవ్ మాట్లాడుతు కేంద్రంలో అధికారంలో ఉన్నా బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వినోద్ కుమార్, శివప్ప, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.